చదువుల బడి.. పేదల ఒడి..

- సర్కారు బడికి కార్పొరేట్ హంగులు
- నాడు- నేడు మారిన రూపు రేఖలు
- రూ.53 కోట్లతో 68 పాఠశాలలు ఆధునికీకరణ
- జెడ్పీ పాఠశాలల్లో సీట్లకు గిరాకీ

నగరంలో పాఠశాలలు	68
కేటాయించిన నిధులు	రూ.53 కోట్లు



నాడు- నేడుతో మారిన పాఠశాల

నాడు- నేడుకు ముందు వీవర్స్ కాలనీ ఉన్నత పాఠశాలలో చెట్ల కింద చదువుతున్న విద్యార్థులు →





మంగళగిరి: సర్కార్ బడి మురిసిపోతోంది. అమ్మఒడి ఆశల బడిగా మారింది. చిన్నారుల బుడిబుడి నడకలు పాఠశాల వైపు పడుతున్నాయి. ముసిముసి నవ్వులతో బడి ఒడిలో సేదతీరుతున్నారు. ఆహ్లాదం.. ఆనందాలకు కేంద్రమైంది. ప్రతి తరగతి గది, బల్ల స్వాగతం పలుకుతున్నాయి.. చిన్నారులు అక్కున చేర్చుకునే విధంగా వసతులు వచ్చి చేరాయి. ఇవీ మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంకల్పంతో కార్యరూపం దాల్చాయి. ఏ బడి చూసిన సకల వసతులతో అక్షరం దిద్దించే బాధ్యత మాదంటూ ఎదురుచూస్తున్నాయి..

జెడ్పీ హైస్కూల్‌కు ఖర్చు ఇలా..	
వీవర్స్ కాలనీ పాఠశాలకు	రూ.1.60 కోట్లు
పెనుమాక పాఠశాలకు	రూ.2.50 కోట్లు
తాడేపల్లి పాఠశాలకు	రూ.2.50కోట్లు,
నిడమర్రు పాఠశాలకు	రూ.1.50 కోట్లు,
నూతక్కి పాఠశాలకు	రూ. 50లక్షలు,
వడ్డేశ్వరం పాఠశాలకు	రూ. కోటి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యారంగంపై దృష్టి సారించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు మించి తీర్చిదిద్దేందుకు నాడు- నేడు, మనబడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, జగనన్న విద్యావసతి లాంటి పథకాలను ప్రవేశపెట్టి పేదలకు మెరుగైన నాణ్యమైన విద్యను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధితో పాటు డిజిటల్ తరగతులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆహ్లాదకరంగా తరగతి గదులు, విశాలమైన ఆటస్థలాలను తీర్చిదిద్దారు. దీంతో మంగళగిరి నగరంలోని జెడ్పీ పాఠశాలల్లో అడ్మిషన్లు పోటీ ఏర్పడింది.



నూతనంగా నిర్మించిన వాష్ రూమ్‌లు



పాత వాష్ బేసిన్

ఆనందంగా ఉంది



ఒకటో తరగతిలో చేరినప్పటి నుంచి 5 వ తరగతి వరకు పాఠశాలలో చెట్ల కిద కూర్చుని చదువుకునే వాళ్లం. ఈ మూడేళ్లలో పాఠశాలలో కొత్త గదులు నిర్మించారు. డిజిటల్ తరగతులు, ఆటలు, మంచి భోజనం అన్ని ఇస్తుండడంతో చాలా మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

– పల్లవి 8 వ తరగతి

ప్రైవేట్ పాఠశాల నుంచి ఇక్కడకు..



ఉన్నత పాఠశాలలో చదువుతున్నాను. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడేళ్లలో పాఠశాల రూపురేఖలు మారాయి. కార్పొరేట్ పాఠశాల కంటే బాగుంది. డిజిటల్ క్లాసులతో పాటు మాకు అర్థమయ్యేలా చదువు చెబుతున్నారు. మంచి భోజనం, పౌష్టికాహారం, పుస్తకాలు ఇస్తున్నారు. ప్రైవేటు స్కూలుకు వెళ్లే వారు ఇప్పుడు ఈ పాఠశాలలో చాలా మంది చేరారు.

– జొన్నాదుల శ్రీలక్ష్మి, 9వ తరగతి

పాఠశాలల రూపురేఖలు మారాయి

మూడేళ్లలో నాడు- నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. కొన్ని పాఠశాలల్లో అడ్మిషన్లు కొరకు సిఫారసు చేయిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటి నుంచే ప్రభుత్వ పాఠశాలలో సీటు కోసం తల్లిదండ్రులు కార్యాలయానికి వస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో తెచ్చిన మార్పులు అభినందనీయం.

– సత్యనారాయణ, ఎంఈఓ, మంగళగిరి

క్లుప్తంగా

చిన్నారితో యువకుడి అసభ్య ప్రవర్తన

తాడికొండ: బాలిక(4)పై యువకుడు అసభ్య ప్రవర్తనకు పాల్పడిన ఘటన తాడికొండ మండలం రావెల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నక్కా గోపి(18) పక్క ఇంటిలో ఉంటున్న నాలుగు సంవత్సరాల చిన్నారి ఆడుకుంటుండగా ఇంటిలోకి పిలిచి తలుపు వేసి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేస్తుండటంతో గమనించిన తల్లి కిటికిలోంచి తొంగి చూడగా నిందితుడు తల్లిపై రాళ్లు విసిరి ఘటనా స్థలం నుంచి పారిపోయాడు. చిన్నారితో కలసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి బాలికను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హ్యాండ్ రైటింగ్‌లో విద్యార్థిని ప్రతిభ



తాడేపల్లిరూరల్: రాష్ట్రస్థాయి హ్యాండ్ రైటింగ్ పోటీలలో ఎంటీఎంసీ పరిధిలోని నులకపేట ఉర్దూ పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతిని సాధించింది. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని రజినిని ఎంఈఓలు శాంతకుమారి, డి. నాగేశ్వరరావు తమ కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ షజీర్ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు అందజేత



తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి ఆధ్వర్యంలో 40 మంది మహిళలకు సోమవారం కుట్టు మిషన్లు అందజేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, కుట్టు శిక్షకురాలు దామర్ల హేమపద్మజ మాట్లాడుతూ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి తన సొంత నిధులతో మూడు నెలల పాటు మహిళలకు కుట్టుమిషన్‌పై శిక్షణ ఇప్పించి, వారికి సర్టిఫికేట్‌ను అందజేశారని చెప్పారు. కుట్టు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని వేణుగోపాల స్వామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు మున్నంగి వివేకానంద రెడ్డి, నాయకులు కళ్లం రాజశేఖరరెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డి, రెడ్డిబత్తుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వేణుగోపాల స్వామిరెడ్డి, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు హేమపద్మజను మహిళలు ఘన సన్మానించారు.

పెదపాలెంలో మేరీమాత మహోత్సవం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెంలో ఏసు తిరు హృదయ దేవాలయం ఆర్‌సీఎం చర్చిలో సోమవారం మేరీమాత మహోత్సవ సందర్భంగా తేరు ప్రదక్షిణ కార్యక్రమాన్ని సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. రెవ.ఫాదర్ అంథోని రాజు, ప్రభుకుమార్, కిరణ్ పాల్గొని దివ్య బలిపూజ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు భారీగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఆర్‌సీఎం చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై మేరీమాతను ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఫిరంగిపురం: ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని నుదురుపాడుపీహెచ్‌సీ వైద్యాధికారి ఫరీనాబేగం సూచించారు. మండలంలోని గుండాలపాడులో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 89 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. మధ్యాహ్నం అంగన్‌వాడీకేంద్రాలు, పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు, బరువు, ఎత్తు చూసి వారిలో రక్తహీనత ఉన్నవారిని గుర్తించారు. ఈసందర్భంగా ఫరీనాబేగం మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని కోరారు. గోళ్లు పెంచుకోకుండా ఉండాలని, గోళ్లలో మట్టి చేరకుండా చూసుకోవాలన్నారు. భోజనం చేసే సమయంలో వాటిద్వారా నులిపురుగులు పొట్టలో చేరి రక్తహీనతకు గురవుతారని హెచ్చరించారు.

కరాటేలో ఎయిమీ విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీలలో సిల్వర్ మెడల్ సాధించిన సురసాని అక్షిత

తాడేపల్లిరూరల్: జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో తాడేపల్లి రూరల్ పరిధి, ప్రాతూరులోని ఎయిమీ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేకేఏ ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె.రవిబాబు మాట్లాడుతూ జనవరి 24 నుంచి 28వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జపాన్ కరాటే మాస్టర్లతో 41వ జాతీయ స్థాయి క్యాంప్ మరియు 16వ జాతీయ స్థాయి కరాటే పోటీలు ఎయిమీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించారని, ఈ పోటీలకు 19 రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రాతూరులోని ఎయిమీ ఇంటర్నేషన్ స్కూల్ విద్యార్థిని సురసాని అక్షిత (7వ తరగతి) అండర్ 12 గర్ల్స్ కుమితే ఫైట్ విభాగంలో సిల్వర్ మెడల్‌ను సాధించిందని తెలిపారు. జపాన్ కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యాలయం టోక్యో నుంచి విచ్చేసిన టోమియో ఇమాయురా షిహాన్, హిడిమోటో కురిహర సెన్సియెలు ప్రత్యేక కరాటే శిక్షణలో చాగంటి స్నేహిత, చాగంటి స్నిగ్ధ, చాగంటి గోవర్ధన్‌రెడ్డి పోటీలలో ప్రతిభ కనబరిచారని చెప్పారు. ఈ సందర్భంగా సిల్వర్ మెడల్ సాధించిన సురసాని అక్షితను, కోచ్ కొడాలి సాగరికను ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి రవిబాబు, ఎయిమీ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ ఓంకార దంతు, జేకేఏ సౌత్ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఆర్. సుదర్శన్ అభినందించారు.

రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీ ఆర్‌వీఎస్ ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య



మాట్లాడుతున్న భాస్కరయ్య

తాడేపల్లిరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడిన రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య కోరారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి అమరారెడ్డి భవన్‌లో రాష్ట్ర స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 72 సంవత్సరాలు గడిచినా భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన రిజర్వేషన్లు అమలు జరగడం లేదని చెప్పారు. రజక వృత్తిదారులు దుర్భర జీవనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. రజక వృత్తిని సేవా వృత్తిగా భావించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రజక వృత్తిదారులకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. రజక వృత్తిదారులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్ట పరిధిలో రక్షణ కల్పించాలని కోరారు. 50 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికి వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. రజక వృత్తిదారుల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.1000 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రజక లాండ్రీ వృత్తిదారులకు సంవత్సరానికి 10 వేల రూపాయలు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించాలని, ఆదరణ పథకం -2 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఆదరణ పనిముట్లు అందజేయాలని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఢేపీ రాష్ట్ర గృహ నిర్మాణ పథకం ద్వారా కేటాయించే హౌసింగ్ పథకం ద్వారా అర్హులైన ప్రతి రజక కుటుంబానికి శాశ్వత గృహ నిర్మాణ పథకం ద్వారా గృహాలు మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమ రాజ్యం జగనన్నతోనే సాధ్యం

- పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి
- పట్టణంలో 'గుడ్ మార్నింగ్ మంగళగిరి'



నిడమర్రు గేటు వద్ద సమస్యలు తెలుసుకుంటున్న గంజి చిరంజీవి

మంగళగిరి: సంక్షేమ రాజ్యం జగనన్నతో సాధ్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. మంగళగిరి పట్టణంలోని నిడమర్రు రైల్వేగేటు వద్ద నుంచి సోమవారం గుడ్ మార్నింగ్ మంగళగిరి కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వాలకు జగనన్న ప్రభుత్వానికి ఉన్న తేడాని వివరించడంతో పాటు ప్రస్తుతం ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. చిరంజీవి మాట్లాడుతూ పేదలకు అవసరమైన విద్య, వైద్యం నేడు అత్యంత ఖర్చుతో కూడుకున్నవని ఆ రెంటిని పేదలకు ఉచితంగా అందించినప్పుడే పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో సమాజం అభివృద్ధి చెందుతుందని భావించిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, కురగంటి ఆదామ్, బేతపూడి నరసయ్య, కొల్లి శేషిరెడ్డి, తోట శ్రీనివాసరావు,రాజేష్, వందనం, దేవళ్ళ సుబ్బారావు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

తాడికొండ: రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్న ఎంపీడీఓ బి.శివన్నారాయణను పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. అందరితో మంచిగా వ్యవహరిస్తూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఆయనకు సాటి ఎవరూ లేరన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓను దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పుల శేషగిరిరావు, ఆలూరి శ్రీనివాసరావు, బోరుపాలెం అధ్యక్షుడు చనుమోలు రామారావు, కొప్పుల ఆంధ్రేయప్ప, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్ గద్దర్ చెన్నకేశవ, మాజీ సర్పంచి తుమ్మూరు ప్రసాద్ రెడ్డి, కొయ్యగూర వినోద్ పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి, వేదికపై ఎమ్మెల్సీ మురుగుడు

- ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త గంజి చిరంజీవి
- వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

మంగళగిరి: మంగళగిరిలో ఈనెల 31వ తేదీ నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దామని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి పిలుపునిచ్చారు. పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న కన్వెన్షన్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం సోమవారం రాత్రి నిర్వహించారు. వారు మాట్లాడుతూ యాత్రలను జయప్రదం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. మంగళగిరి ప్రజలపై పెత్తందారితనం చేయడానికి వచ్చిన టీడీపీ నాయకులు రానున్న ఎన్నికలలో తరిమికొట్టాలని కోరారు. పేదలకు పెత్తందారులకు మధ్య యుద్ధంలో పెత్తందారులను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నాని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, పార్టీ నాయకులు దొంతిరెడ్డి వేమారెడ్డి, చిల్లపల్లి మోహనరావు, మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్, తోట శ్రీనివాసరావు, సంకె సునీత, దామర్ల కుబేరస్వామి, మల్లవరపు సుధారాణి, నాలి వెంకటకృష్ణ, రేఖా వకులాదేవి పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి



ఫిరంగిపురం: ఇటీవల మండలంలోని పలుగ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో పరీక్షలు చేయించుకుని పెద్ద వైద్యశాలలకు రిఫర్ చేసిన వారిని తప్పని సరిగా పరీక్షలు చేయించుకునేలా చూడాల్సిన బాధ్యత ఆరోగ్యసిబ్బందిపై ఉందని జిల్లా ప్రోగ్రాం అధికారి రత్నమన్‌మోహన్ కోరారు. మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఇప్పటి వరకు జగనన్న ఆరోగ్య సురక్షలో ఎందరు పరీక్షలు చేయించుకున్నారో వారి వివరాలు వైద్యాధికారి యానిగ్రేస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యసిబ్బంది ఇప్పటి వరకు పరీక్షలు చేయించుకునేందుకు వెళ్లని రోగుల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకునేలా చూడాలని చెప్పారు. పేదవారి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం ఫిరంగిపురంలో పరీక్షలు కోసం రిఫర్ చేసిన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



తాడికొండ: తాడికొండ బస్టాండ్ కూడలిలో బీఎస్ఎస్‌బీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తులసీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులతో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని సచివాలయం -4 కార్యదర్శి సుమియా ప్రారంభించారు. 153 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిగ్రీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సునీతా లక్ష్మి, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఏపీ రాఘవయ్య పాల్గొన్నారు.

అకౌంట్ నుంచి నగదు మాయం చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: వృద్ధురాలి కేర్ టేకర్‌గా ఉన్న వ్యక్తి ఆమె అకౌంట్‌లో నగదు డ్రా చేసిన ఘటనపై పట్టాభిపురం కేసు నమోదు చేశారు. రామన్నపేట 1/5లో బీహెచ్. అనూరాధ తల్లి ఒంటరిగా నివసిస్తోంది. ఆమెకు పి.సాంబశివరావు కేర్ టేకర్‌గా ఉన్నాడు. వృద్ధురాలి సెల్‌ఫోన్ పేటీఎం నుంచి పలుమార్లు తన అకౌంట్‌లోకి రూ. 9 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడు. ఆలస్యంగా గుర్తించిన అనూరాధ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులగణన సర్వే 90శాతం పూర్తి

ఫిరంగిపురం: మండలంలోని 15 సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న కులగణన సర్వే 90 శాతం పూర్తి అయినట్లు ఎంపీడీఓ విలియమ్స్ సోమవారం తెలిపారు. 15 సచివాలయాల పరిధిలోని 18 గ్రామాల్లో 19 నుంచి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కలసి నిర్వహిస్తున్న సర్వే ఈనెల 28వ తేదీతో పూర్తి కావాల్సి ఉండగా ప్రభుత్వం మరికొన్ని రోజులు సర్వే చేసేందుకు పొడిగించినట్లు చెప్పారు.

ప్రతిభను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

వైఎస్సార్ సీపీ నాయకులు చిరంజీవి, వేమారెడ్డి



తాడేపల్లిరూరల్: పేద క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించినట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ముగింపు సభ పెనుమాక జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. కబాడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ డి.సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, కార్పొరేషన్ సెక్రటరి శ్రీనివాసరావు, దుగ్గిరాల ఎంపీడీఓ వీరయ్య, పెనుమాక సొసైటీ అధ్యక్షులు మేకా శివారెడ్డి, పార్టీ అధ్యక్షులు దామేష్, బషీర్, భుజంగరావు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాకు చర్యలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెంలో సొసైటీలో ఎరువులు సరఫరాకు చర్యలు తీసుకుంటామని జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ తెలిపారు. సోమవారం పలువురు రైతులు ఎరువులు అందుబాటులో లేవని, నూతక్కి సొసైటీకి వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె పెదపాలెం సొసైటీకి వెళ్లి అధికారులతో చర్చించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పెదపాలెం సొసైటీ అధ్యక్షుడిగా పనిచేసిన వ్యక్తి అనివార్య కారణాల వల్ల పదవికి రాజీనామా చేశారని, సమన్వయ లోపంతో కారణంగా ఇబ్బందులు వచ్చినట్లు చెప్పారు. మంగళ, బుధవారాల్లో పెదపాలెం సొసైటీతో పాటు చుట్టుపక్కల రైతు భరోసా కేంద్రాల్లో కూడా రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. ఆమె వెంట ఏఓ శిరీష ఉన్నారు.

రేపు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రూప్- 2పై సదస్సు

ఏఎన్‌యూ: వికాస్ భవన్‌లో ఈనెల 31న జరుగనున్న గ్రూప్- 2 అవగాహన సదస్సు పోస్టర్‌ను సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సదస్సులో ప్రధాన వక్తగా ప్రముఖ విద్యావేత్త ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పాల్గొని, అభ్యర్థుల ప్రశ్నలను నివృత్తి చేస్తారని చెప్పారు. ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ ప్రెసిడెంట్ సంతోష్ , సెక్రటరీ ఆదిశేషు, కమిటీ మెంబర్ నవిత పాల్గొన్నారు.